# నగర పాలన.. నరకయాతన




- సమస్యల వలయంలో రామగుండం
- సిబ్బంది కొరతతో వ్యవస్థ అస్తవ్యస్తం
- కీలక పోస్టులన్నీ ఖాళీగానే
- తాత్కాలిక ఒప్పంద సిబ్బందే ఆధారం
- 262 పోస్టుల్లో 126 ఖాళీగానే
- పారిశుద్ధ్యం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం
- దారుణంగా వీధి దీపాల నిర్వహణ
- పన్నుల వసూలు సైతం అంతంత మాత్రమే
- గాడి తప్పుతున్న ప్రజా రోగ్య వ్యవస్థ

**డిడి 9వార్త పెద్దపల్లి ప్రతినిధి :** నగర పాలన అంటే ప్రజా సేవ. కానీ రామగుండం నగరపాలికలో ఈ సేవా వ్యవస్థ సిబ్బంది కొరత అనే మహా సమస్యతో రోజురోజుకీ కుప్పకూలుతోంది. కీలక పోస్టులు ఖాళీలుగానే ఉండగా, తాత్కాలిక ఒప్పంద ఉద్యోగుల మీద ఆధారపడి వ్యవస్థను నెట్టుకొస్తున్నారు. ఫలితంగా ప్రజలకు అందాల్సిన ప్రాథమిక సదుపాయాలు అస్తవ్యస్తమవుతున్నాయి. నగరపాలికలో మంజూరైన పోస్టులు 262 కాగా, వాస్తవంగా పనిచేస్తున్న వారు కేవలం 136 మంది మాత్రమే. మిగిలిన 126 పోస్టులు ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయి. ఈ పరిస్థితి పట్టణ ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యం, ఆదాయ వ్యవస్థపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది.

## పారిశుధ్యం కాగితాలకే పరిమితం

నగర నిర్వహణలో కీలకమైన పారిశుధ్య విభాగంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. పర్యవేక్షణకు అవసరమైన సిబ్బంది లేకపోవడంతో చెత్త సేకరణ, డ్రైనేజీ శుభ్రపరిచే పనులు అస్తవ్యస్తంగా కొనసాగుతున్నాయి. మొత్తం ఆరు పారిశుధ్య పర్యవేక్షకుల పోస్టులు ఉండగా, ప్రస్తుతం ముగ్గురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో కొందరు స్థానికంగా అందుబాటులో ఉండకపోవడంతో పర్యవేక్షణ పేరుకే పరిమితమవుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. 85 మంది పారిశుధ్య కార్మికులకు గాను ప్రస్తుతం 44 మంది మాత్రమే విధుల్లో కొనసాగుతున్నారు. దీంతో పట్టణంలోని పలు డివిజన్లలో చెత్త రోజుల తరబడి పేరుకుపోతున్న పరిస్థితి నెలకొంది. ప్రజారోగ్య విభాగం గాడి తప్పుతున్నా పట్టించుకునే నాథుడు లేరు ప్రజల ఆరోగ్యమే కేంద్రంగా పనిచేయాల్సిన మునిసిపల్ హెల్త్ విభాగం దిశాహీనంగా మారింది. మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ పోస్టు ఎన్నేళ్లుగానో ఖాళీగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఇద్దరు ఆరోగ్య సహాయకుల స్థానాలు కూడా భర్తీ కావడం లేదు. వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ముప్పుగా మారినా, పర్యవేక్షించాల్సిన అధికారులే లేకపోవడం వల్ల ముందస్తు చర్యలు సక్రమంగా జరగడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



## కరెంటు, పన్నుల వ్యవస్థ చీకట్లోనే

పట్టణంలో వీధి దీపాల నిర్వహణ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఎలక్ట్రికల్ హెల్పర్ పోస్టులు ఐదు ఉండగా, ప్రస్తుతం విధుల్లో ఉన్నవారు ఒక్కరే. దీంతో అనేక కాలనీల్లో వీధి దీపాలు సరిచేయని పరిస్థితి నెలకొని ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మునిసిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరైన రెవెన్యూ విభాగంలోనూ పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. 19 బిల్ కలెక్టర్ పోస్టులకు గానూ కేవలం ముగ్గురు మాత్రమే పని చేస్తున్నారు. రెవెన్యూ అధికారి పోస్టులు రెండు ఉండగా ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. పన్నుల వసూలుపై దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల 31 మంది వీఆర్వోలను నగరపాలికల్లో వార్డు అధికారులుగా నియమించినా, తిరిగి గ్రామ పంచాయతీలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వడంతో మరో 10 కీలక పోస్టులు ఖాళీ అయ్యాయి.

## డిప్యూటేషన్, ఒప్పంద ఉద్యోగాలపైనే ఆధారపడుతున్న పాలన

నగరపాలికలో ప్రస్తుతం సుమారు 400 మంది ఒప్పంద ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. శాశ్వత నియామకాలు లేకుండా ఒప్పంద పద్ధతిలోనే వ్యవస్థను నడిపించడంపై విమర్శలు పెరుగుతున్నాయి. డిప్యూటేషన్ పై వచ్చిన సిబ్బంది ఆధిపత్యం, పారదర్శకత లోపించడం, అవకతవకలకు ఆస్కారం పెరుగుతుందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గతంలో కొన్ని విభాగాల్లో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణలు కొనసాగుతున్నాయి.

## ఖాళీలకు ఎప్పుడెప్పుడు భర్తీ?

పట్టణ ప్రజలు అడుగుతున్న ఒక్క ప్రశ్న "ఇన్ని సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న పోస్టులు ఎప్పుడు భర్తీ అవుతాయి?" అని. ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా... నగరపాలికలో సిబ్బంది కొరత మాత్రం అలాగే కొనసాగుతోంది. ప్రజలకు మౌలిక వసతులు అందించాలంటే ముందుగా వ్యవస్థ బలపడాలి. అది శాశ్వత నియామకాలతోనే సాధ్యమని పలువురు మేధావులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.




